క్లుప్తంగా

సచివాలయ ఉద్యోగుల గైర్హాజరుపై ఆర్డీఓ ఆగ్రహం



రోలుపడి(తిరువూరురూరల్): మండలంలోని రోలుపడి సచివాలయాన్ని తిరువూరు రెవెన్యూ డివిజినల్ అధికారి కె. మాధురి మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. మహిళా సంరక్షణ కార్యదర్శి మినహా మిగిలిన సిబ్బంది విధులకు గైర్హాజరవడంతో ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. సచివాలయ రికార్డులను పరిశీలించిన ఆమె సిబ్బంది గైర్హాజరుపై చర్యలకు సిఫారసు చేశారు. రాజీవ్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం పరిసరాలు పరిశుభ్రత లేకపోవడంతో ఆమె అసహనం వ్యక్తం చేశారు. మురుగునీరు నిలిచి పోయి నాచు పట్టడం, గడ్డి, పిచ్చిమొక్కలతో అపరిశుభ్రంగా ఉండటంతో వెంటనే శుభ్రం చేయాలని ఆదేశించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో తరగతి గదులను పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు.

కరపత్రాల ఆవిష్కరణ



తిరువూరు: తిరువూరులో ఈ నెల 22న జరుగనున్న బాలోత్సవం కార్యక్రమ కరపత్రాలను మంగళవారం ఎంఈఓ కార్యాలయంలో ఆవిష్కరించారు. విద్యార్థుల్లో సృజనాత్మకత పెంపొందించేందుకు, కళా నైపుణ్యాలు వెలికి తీసేందుకు 36 రకాల కార్యక్రమాలను బాలోత్సవంలో ఏర్పాటు చేశామని నిర్వాహక సభ్యులు హరికృష్ణ, పాపారావు తెలిపారు. తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో జరిగే కార్యక్రమానికి ఈ నెల 17లోగా ఎంట్రీలు అందజేయాలన్నారు. ఎంఈఓ శ్యాం సుందర్, పలు పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి రూ.లక్ష విరాళం



చాట్రాయి: ఎమ్మార్పీఎస్ ఉద్యమానికి పోలవరం గ్రామానికి చెందిన బిలుగుడి జీవన్ మహేష్ లక్ష రూపాయల చెక్కును ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగకు మంగళవారం హైదరాబాద్‌లో అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఒక జాతి కోసం 30 ఏళ్లుగా అలుపెరుగని పోరాటం చేస్తున్నందుకు ఉద్యమ స్ఫూర్తిగా నా వంతుగా సహాయం అందజేశామని ఆయన చెప్పారు.

కత్తెర పురుగు నివారణకు చర్యలు తీసుకోవాలి

చాట్రాయి: మొక్కజొన్న పైరుకు ఆశించిన కత్తెర పురుగు నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని నూజివీడు వ్యవసాయ సంచాలకులు విద్యాసాగర్ అన్నారు. నరసింహారావుపాలెం గ్రామంలో మొక్కజొన్న పైరును మంగళవారం ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ సస్యరక్షణ చర్యలు, ఎరువుల యాజమాన్యంపై రైతులు అవగాహన కలిగి ఉండాలన్నారు. కత్తెర పురుగు నివారణకు ఐదు శాతం ఇమామెక్టిన్ బెంజోయేట్, లీటర్ వేప నూనెను ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలని సూచించారు. ప్రతి రైతూ తమ పంటలను ఈ-కేవైసీ చేయించుకోవాలని, దీని వల్ల ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు పంట నష్ట పరిహారం ప్రభుత్వం చెల్లిస్తుందన్నారు. కార్యక్రమంలో ఏఈఓ ఉదయ్ భాస్కర్, వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ



ముసునూరు: సమగ్ర అవగాహన, అప్రమత్తతతో క్యాన్సర్ వ్యాధిని ముందుగానే గుర్తించి వైద్య చికిత్సలు, తగిన జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా మరణాల సంఖ్యను తగ్గించవచ్చని రమణక్కపేట పీహెచ్‌సీ వైద్యాధికారులు డాక్టర్ కరీముల్లా, డాక్టర్ అవినాష్ అన్నారు. ప్రపంచ క్యాన్సర్ దినోత్సవం సందర్భంగా మంగళవారం వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో రమణక్కపేట గ్రామంలో క్యాన్సర్ వ్యాధిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ అర్జునరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు శోభనాచలుని దివ్య రథోత్సవం

ఆగిరిపల్లి: శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీ నరసింహ స్వామి వారి దివ్య రథోత్సవం బుధవారం నిర్వహించనున్నారు. ఉత్సవంలో ప్రధాన భాగమైన పెద్ద రథాన్ని పొన్నం లక్ష్మణరావు సోదరుల సహకారంతో సద్గురు ఈవెంట్స్ వారి ఆధ్వర్యంలో పుష్పాలతో అలంకరించారు.

నిర్మాణం పూర్తి.. ప్రారంభం ఎప్పుడో?

- గత ప్రభుత్వ హయాంలో ఆరోగ్య కేంద్ర భవన నిర్మాణ పనులు ప్రారంభం
- రూ.80 లక్షల వ్యయంతో ఎమ్మార్ అప్పారావు కాలనీలో నిర్మాణం పూర్తి
- ఈ ఆస్పత్రి ప్రారంభం కోసం కాలనీ వాసుల ఎదురు చూపులు



ఎమ్మార్ అప్పారావు కాలనీలో ప్రారంభానికి సిద్ధంగా ఉన్న పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవనం

నూజివీడు: ఎమ్మార్ అప్పారావు కాలనీలో సుమారు 10 వేల మంది జనాభా నివశిస్తున్నారు. ఇక్కడి వారంతా నిరుపేద, పేద, మధ్య తరగతి ప్రజలే. ఈ కాలనీ వాసుల జీవనాధారం కూలి పనులు.. చిరు ఉద్యోగాలు. పట్టణానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉండే కాలనీ వాసులకు జ్వరమొచ్చినా, దగ్గు వచ్చినా, చెవిలో, కడుపులో నొప్పి అయినా కాలనీలో ఉండే ఆర్ఎంపీలే దిక్కు. జ్వరమొచ్చి ప్రభుత్వ వైద్యుని దగ్గరకు వెళ్లాలన్నా, ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాలన్నా ఐదు కిలోమీటర్ల దూరంలోని నూజివీడు పట్టణానికి వెళ్లాల్సిందే. అర్ధరాత్రయినా ఇదే పరిస్థితి. అత్యవసరం అయితే ఆర్ఎంపీల వద్ద వైద్యం చేయించుకుని వారు అడిగినంత ఇచ్చుకోవాల్సిందే.

వైద్యం అందుబాటులోకి తెచ్చేందుకు..

ఈ పరిస్థితుల్లో కాలనీ వాసులకు ఎలాగైనా వైద్యాన్ని అందుబాటులోకి తీసుకురావాలని గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నిర్ణయించారు. ఎమ్మార్ అప్పారావు కాలనీలో పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేసి కాలనీ వాసులకు వైద్యసేవలను చేరువ చేయాలనే లక్ష్యంతో రూ.80 లక్షల వ్యయంతో భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పనులు చురుగ్గా కొనసాగి రెండు నెలల కిందటే పనులు పూర్తి చేసుకుని ఆస్పత్రి భవనం ప్రారంభోత్సవానికి సిద్ధమైంది. ఇక్కడ ఆస్పత్రి అందుబాటులోకి వస్తే ఎమ్మార్ అప్పారావు కాలనీ వాసులు వైద్యం కోసం పట్టణానికి వెళ్లాల్సిన అవసరం ఉండదు. ఈ ఆస్పత్రిలోనే రక్త పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులను కూడా ఉచితంగా అందజేస్తారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు వైద్యులు అందుబాటులో ఉంటారు. పేద, మధ్య తరగతి ప్రజలకు ప్రైవేటు ఆస్పత్రులకు వెళ్లే అవసరం తప్పుతుంది.

అందుబాటులో 10 పడకలు

ఆస్పత్రి భవనం ప్రారంభమైతే రోగులకు పది పడకలు సైతం అందుబాటులోకి వస్తాయి. దీనిలో ఫార్మసీ, ఔట్ పేషెంట్ గదులు, రెండు శస్త్రచికిత్స గదులు, ల్యాబొరేటరీ, రోగుల సహాయకులకు విశ్రాంతి గదులు, వైద్యుల గది ఉన్నాయి. ఆస్పత్రికి అవసరమైన వైద్యులు, స్టాఫ్ నర్సులు, ఏఎన్ఎంలు, ల్యాబ్ టెక్నీషియన్లను సైతం గతంలోనే ప్రభుత్వం నియమించింది. అన్ని రకాల రక్త పరీక్షలు ఇక్కడ ఉచితంగా నిర్వహిస్తారు.


ఆస్పత్రిని ప్రారంభిస్తే ప్రజలకు మేలు



భవన నిర్మాణం పూర్తయినందున ఆస్పత్రి ప్రారంభమైతే కాలనీ వాసులకు వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయి. ఎవరూ కూడా ఆస్పత్రికి నూజివీడు టౌన్‌కు వెళ్లాల్సిన పని ఉండదు. కాలనీ వాసులు కూడా ఎప్పుడు ఆస్పత్రిని ప్రారంభిస్తారా అని ఎదురు చూస్తున్నారు.

– నౌషత్ బేగం, ఎమ్మార్ అప్పారావు కాలనీ, నూజివీడు

● ఆత్మీయ కలయిక



మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పార్టీ తిరువూరు నియోజక వర్గ ఇన్‌చార్జి నల్లగట్ల స్వామిదాసు తాడేపల్లిలోని పార్టీ కార్యాలయంలో మంగళవారం కలిశారు. తిరువూరు నియోజకవర్గ పార్టీ పరిస్థితులను వైఎస్ జగన్ మోహనరెడ్డికి ఈ సందర్భంగా ఆయన వివరించారు.

–తిరువూరు

మత్తు పదార్థాలతో జీవితాలు చిత్తు



మాట్లాడుతున్న డాక్టర్ ఆర్.పద్మావతి

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): మాదక ద్రవ్యాలు మెదడుపై తీవ్ర ప్రభావం చూపుతాయని, జీవితాలు చిత్తవుతాయని కొండపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఆర్.పద్మావతి అన్నారు. కొండపల్లి పీహెచ్‌సీలో నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో ఏఎన్ఎం, ఆశాలకు మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై ఒక రోజు వర్క్‌షాపు మంగళవారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాలు సేవించిన వ్యక్తులు మానసికంగా, శారీరకంగా కుంగిపోతారన్నారు. నీతోడు మానసిక వికాస కేంద్రం జోనల్ కో–ఆర్డినేటర్ కె.ప్రియాంక మాట్లాడుతూ మత్తుకు అలవాటు పడిన యువత, బాలలకు డీ అడిక్షన్ కేంద్రంలో ఉచిత చికిత్స అందిస్తామన్నారు. వివరాలకు 94904 92020 నంబర్‌ను సంప్రదించాలని కోరారు. జేఎంఎస్‌కే రమాదేవి, ఏఎన్ఎంలు, ఆశాలు పాల్గొన్నారు.


భక్తిశ్రద్ధలతో రథ సప్తమి వేడుకలు



తిరువూరు కోదండ రామాలయంలో పూజలు



ఇబ్రహీంపట్నంలో సూర్య నమస్కారాలు చేస్తున్న యోగా సాధకులు



ప్రత్యేకాలంకరణలో వ్యాఘ్ర లక్ష్మీ నరసింహస్వామి



శోభనాచలుడిని పట్టువస్త్రాలు తీసుకెళ్తున్న మంత్రి పార్థసారథి

తిరువూరు: రథ సప్తమి వేడుకలు తిరువూరు, మైలవరం, నూజివీడులోని పలు దేవాలయాల్లో మంగళవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తిరువూరులోని కోదండ రామాలయంలో సూర్యోపాసన, సూర్య నమస్కారాలు, హోమాలను ఆలయ అర్చకులు సత్యనారాయణాచార్యులు, విఠలాచార్యులు, పార్థసారధాచార్యులు ఆధ్వర్యంలో జరిగాయి. షిర్డీ సాయి మందిరంలో జరిగిన విశేష పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు. రాజుపేట వీరాంజనేయస్వామి ఆలయంలో రథ సప్తమి విశేష పూజలు జరిపారు.

● **ఇబ్రహీంపట్నం:** సూర్య భగవానుడు సకల జీవ కోటికి ప్రాణదాత అని ఎన్టీటీపీఎస్ ఎస్ఈ ఎస్. నాగేశ్వరరావు అన్నారు. రథ సప్తమి పర్వదినం సందర్భంగా శాంతివన్ యోగా ఫౌండేషన్ ఆధ్వర్యంలో వారం రోజులుగా జరుగుతున్న 108 సామూహిక సూర్య నమస్కారాల సప్తాహం ముగింపు కార్యక్రమం స్థానిక ఎ. కాలనీ అయ్యప్ప స్వామి ఆలయంలో మంగళవారం నిర్వహించారు. శాంతివన్ యోగా ఫౌండేషన్ అధ్యక్షుడు జనార్దన్ సాధకులతో 108 సూర్య నమస్కారాలు పోటీలు నిర్వహించి విజేతలకు మెమోంటోలు అందజేశారు. ఎన్టీటీపీఎస్ అధికారులు చంద్రకళాధర రావు, సుబ్రహ్మణ్యం, బాలకృష్ణ, రాజేష్, శ్రీధర్ పాల్గొన్నారు.

● **ఆగిరిపల్లి:** శోభనాచల వ్యాఘ్ర లక్ష్మీనరసింహ స్వామి వారి ఆలయానికి మాఘమాస రథసప్తమి, శాంతి కల్యాణోత్సవంలో భాగంగా మంగళవారం భక్తజనం పోటెత్తారు. గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి మూలవిరాట్‌ను దర్శించుకుని స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. అనంతరం ఆలయం వెలుపల ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.నూజివీడు మున్సిపల్ చైర్మన్ రామిశెట్టి త్రివేణి దుర్గ కుటుంబ సభ్యులు స్వామి వారిని దర్శించుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు వట్టిగుడిపాడుకు చెందిన చింతపట్ల సత్యంబాబు దంపతులు కైంకర్యంలో శాంతి కల్యాణాన్ని జరిపించారు. రాత్రి 9 గంటలకు కల్పవృక్ష వాహనంపై స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు.

శిథిల భవనంతో భయం.. భయం

- నిత్యం ఆందోళనలో విద్యార్థులు
- పట్టించుకోని అధికారులు



శ్లాబ్ పెచ్చులు ఊడి శిథిలావస్థలో ఉన్న ప్రభుత్వ బాలికల హైస్కూల్ భవనం

మైలవరం: ఎంతో మందిని విద్యావంతులను చేసిన మైలవరంలోని మాదల బుల్లయ్య మెమోరియల్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల భవనం శిథిలావస్థకు చేరింది. భవనం శ్లాబు పెచ్చులు ఊడి పడుతుండటంతో ఎప్పుడు, ఏ ప్రమాదం జరుగుతుందోనని విద్యార్థులు, ఉపాధ్యాయులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. పాత భవనం స్థానే నూతన భవనాన్ని నిర్మించాలని విద్యార్థులు, తల్లిదండ్రులు కోరుతున్నారు.

గతంలో ఇలా..

మైలవరం సూరిబాబుపేటలో 1979 ఆగస్టు నెలలో ప్రత్యేకంగా బాలికల చదువు కోసం ప్రభుత్వ పాఠశాలను నిర్మించారు. అప్పట్లో నాటి రాష్ట్ర విద్యా శాఖ మంత్రి భవనం వెంకట్రామ్, రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ఎం.బాగారెడ్డి ఈ పాఠశాల భవనాన్ని ప్రారంభించారు. ఇక్కడ చదివిన ఎంతో మంది బాలికలు ఉన్నత స్థాయికి చేరుకున్నారు.

వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో..

అనంతరం మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో ఈ పాఠశాలను అభివృద్ధి పథంలో నడిపిస్తూ బాలికల కోసం మాదాల బుల్లియ్య మోమోరియల్ జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్లస్–టూగా మార్చారు. దీంతో బాలికలు ఇంటర్ కూడా కొనసాగించుకునే అవకాశం కల్పించారు. బాలికోన్నత పాఠశాలలో 643 మంది బాలికలు ఉండగా ప్లస్–2లో 74 మంది చేరారు. హైస్కూల్‌తో పాటు ప్లస్–2 కూడా నిర్వహిస్తున్నారు. తరగతి గదులు చాలకపోవడంతో పదో తరగతి విద్యార్థినులకు అదనంగా మూడు గదులు నిర్మాణం చేపట్టారు.

ప్రస్తుత పరిస్థితి ఇదీ..

ప్రస్తుతం పాత భవనంలోనే సైన్స్ ల్యాబ్‌లు ఉన్నాయి. వంట సామగ్రిని కూడా భద్రపరుస్తున్నారు. ఈ భవనం వరండాలో భోజన పథకం వంట పనులు నిర్వహిస్తున్నారు. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో భయాందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం చాలీచాలని ఇరుకు గదులతో విద్యార్థినులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి పాత భవనాన్ని తొలగించి, నూతన భవనాన్ని నిర్మించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

భయపడుతున్నారు..



భవనం శ్లాబు పెచ్చులూడిపడుతున్నాయి. ప్రస్తుతం చాలీ చాలని గదుల్లో హైస్కూల్‌తో పాటు ప్లస్–2 విద్యార్థినులకు క్లాస్‌లు నిర్వహిస్తున్నారు. ఇది విద్యార్థినులకు కొంత అసౌకర్యంగా ఉంటోంది. ఇక్కడే వంట ఏజెన్సీ వారు భోజనాలు తయారు చేస్తున్నారు. ఎప్పుడు, ఏ ప్రమాదం జరుగుతుందో తెలియక భయపడుతున్నారు. అధికారులు స్పందించి నూతన భవనం నిర్మాణానికి చర్యలు తీసుకోవాలి.

– ఐ.వెంకటరత్నం, తోలుకోడు, మైలవరం

ప్రణాళికతో చదివితే మంచి ఫలితాలు

మోటివేటర్ జక్కోజు విజయ్



విద్యార్థులకు సూచనలు చేస్తున్న జక్కోజు విజయ్

నూజివీడు: పదో తరగతి విద్యార్థులు సమయాన్ని వృథా చేయకుండా ప్రణాళికతో చదివితే పబ్లిక్ పరీక్షల్లో మెరుగైన మార్కులు సాధించవచ్చని ప్రముఖ మోటివేటర్ జక్కోజు విజయ్ అన్నారు. గొల్లపల్లి హైస్కూల్‌లో లయన్స్ క్లబ్ ఆఫ్ నూజివీడు గ్రేటర్ సౌజన్యంతో ఇంపాక్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పదో తరగతి విద్యార్థులకు మంగళవారం మోటివేషన్ క్లాస్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రతి రోజూ ప్లాన్ చేసుకుని దాని ప్రకారం ముందుకు సాగాలన్నారు. లక్ష్యాన్ని నిర్దేశించుకుని దాని సాధనకు పట్టుదలతో కృషి చేయాలని చెప్పారు. చదువు కోవడం అనేది ఇష్టంతో చేయాలన్నారు. పాఠ్య పుస్తకాలతో పాటు విజ్ఞాన పుస్తకాలను సైతం నిరంతరం చదువుతూ ఉండాలని చెప్పారు. చదవడం అనే దానిని జీవితంలో ఎప్పుడూ ఆపొద్దన్నారు. సమయాన్ని చక్కగా వినియోగించుకున్న వారే జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదుగుతారని వివరించారు. ఈ సందర్భంగా పలు ప్రశ్నలకు జవాబులు చెప్పిన విద్యార్థినులు మేఘన, లక్ష్మీసాయి, అంజనీలకు బహుమతులు అందజేశారు. హెచ్ఎం పొట్లూరి రాధికారాణి, ఉపాధ్యాయులు రవీంద్ర, మల్లేశ్వరి, కృష్ణవేణి, మోహన్‌రావు, మనోహరం, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

6న ఆలయ షాపులకు వేలం

మైలవరం: బొర్రగూడెం గ్రామంలోని తిరుపతమ్మ గోపయ్య స్వామి వార్ల దేవ స్థానం ప్రాంగణంలోని ఆలయానికి చెందిన షాపులకు ఈనెల 6వ తేదీన వేలం నిర్వహిస్తామని ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం. తేజ తెలిపారు. వివిధ ఆట బొమ్మలు, ఫ్యాన్సీ తదితర వస్తువులు అమ్ముకొను హక్కు, వంట పాత్రలు, గ్యాస్ పొయ్యిలు అద్దెకు ఇచ్చే లైసెన్స్ హక్కు, తల నీలాలు పోగు చేసుకునే హక్కు, వాహనాల పార్కింగ్ ఫ్లేస్ లైసెన్స్ హక్కు తదితరాలకు వేలం జరుగుతుందన్నారు. గురువారం ఉదయం 11 గంటల నుంచి శ్రీస్వామి వారి ఆలయం ప్రాంగణంలో వేలం నిర్వహిస్తామని చెప్పారు. ఇతర వివరాలకు ఆలయ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

మానసిక ఆరోగ్యంపై అవగాహన

ఇబ్రహీంపట్నం: వాసవ్య మహిళా మండలి ఆధ్వర్యంలో కమ్యూనిటీ మెంటల్ హెల్త్‌పై స్థానిక వెలుగు కార్యాలయంలో డ్వాక్రా సంఘాల ప్రతినిధులకు అవగాహన సదస్సు మంగళవారం నిర్వహించారు. లీవ్ లవ్ లైఫ్ ఫౌండేషన్ ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ రామారావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో మానసిక దివ్యాంగులకు ఆసరాగా నిలవాలన్నారు. పది నెలల్లో 407 మందిని తమ ప్రాజెక్ట్ ద్వారా గుర్తించి 186 మందికి సకాలంలో వైద్యం, కౌన్సెలింగ్ అందించామని చెప్పారు. డీఆర్డీఏ ఏరియా కో–ఆర్డినేటర్ ఇ. రంగారావు మాట్లాడుతూ వాసవ్య మహిళా మండలి ప్రజలకు చేస్తున్న సేవలను కొనియాడారు. ఏపీఎం శోభన్‌బాబు, ప్రాజెక్ట్ సిబ్బంది పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

తిరువూరు: ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన జాతీయ స్థాయి షోటోకాన్ కుంగ్ ఫూ, కరాటే ఓపెన్ చాంపియన్ షిప్ పోటీల్లో తిరువూరు శ్రీనిధి స్కూల్ విద్యార్థులు పలు పతకాలు సాధించారు. కటా విభాగంలో పాఠశాల విద్యార్థులు చెరుకు నిరంజన్, చెవ్వూరు కనిష్క, గోదా నిఖిల్ శాస్త్రి ప్రథమస్థానం సాధించారు. సుదాబత్తుల పవన్, ఉమా మణికంఠ, చెరుకు జయంతిక, దుర్గా ప్రసాద్, సాయి ద్వితీయ స్థానంలో నిలిచారు. విజేతలను పాఠశాల కరస్పాండెంట్ కిశోర్‌బాబు, ప్రిన్సిపాల్ వెంకట నారాయణ, ఉపాధ్యాయులు అభినందించారు.

22 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం



రేషన్ బియ్యం వాహనాన్ని స్వాధీనం చేసుకున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

మైలవరం: మైలవరం బైపాస్ రోడ్డులోని లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాల జంక్షన్ వద్ద అనధికారికంగా ట్రక్కులో తరలిస్తున్న 22 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నామని తహసీల్దార్ అబ్దుల్ దరియా మంగళవారం తెలిపారు. తహసీల్దార్ మాట్లాడుతూ వాహనాల తనిఖీల్లో భాగంగా ఏపీ07 టీడీ 3718 నంబర్ గల వాహనాన్ని పోలీసులు మంగళవారం తనిఖీ చేశారన్నారు. వాహనంలో 44 బస్తాలు (22 క్వింటాళ్లు) పీడీఎస్ బియ్యం పట్టుబడ్డాయని చెప్పారు. వాహనం డ్రైవర్ బచ్చన బోయిన వెంకట్రావు పల్నాడు జిల్లా గురజాల మండలం పెదగ్రహారం గ్రామానికి చెందినవాడుగా గుర్తించామన్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి సరుకును మైలవరం పట్టణంలోని రేషన్ షాపు నంబర్ 4 కు తరలించామన్నారు.

ఘనంగా భావనాఋషి కల్యాణం



వెలగలేరులో కల్యాణం నిర్వహిస్తున్న పండితులు

జి.కొండూరు: వెలగలేరు చనమోలు వెంకట్రావు కల్యాణ మండపంలో మార్కండేయ పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో భద్రావతి సమేత భావనా ఋషి కల్యాణ మహోత్సవం మంగళవారం ఘనంగా జరిగింది. వేద పండితులు స్వామి వారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు, హోమాలు నిర్వహించారు. కల్యాణ మహోత్సవం అనంతరం అన్నప్రసాద వితరణ చేశారు.

● **కొండపల్లి(ఇబ్రహీంపట్నం):** భద్రావతి సమేత భావనారుషి స్వామివార్ల కల్యాణ మహోత్సవం కొండపల్లిలోని భావనాఋషి ఆలయం వద్ద మంగళవారం జరిగింది. ఆలయ అర్చకులు భావనా ఋషి, భద్రావతి అమ్మవార్లను పూజించడం వలన కలిగే ఫలితాలను వివరించారు. పద్మశాలీ సంఘం పెద్దలు విస్తృత ఏర్పాట్లు చేశారు. కల్యాణ మహోత్సవంలో ఎమ్మెల్సీ పంచుమర్తి అనూరాధ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు.

రెండు గ్రామాల్లో పొలం పిలుస్తోంది

తిరువూరురూరల్: మండలంలోని చింతలపాడు, ఎరుకోపాడు గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. అగ్రి స్టాక్ ఫార్మర్ రిజిస్ట్రీ పోర్టల్‌లో మండలంలోని రైతుల వివరాలను నమోదు చేసి రైతులకు డిజిటల్ ఫార్మర్ ఐడీ ఇస్తామని మండల వ్యవసాయాధికారి పద్మ తెలిపారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లో రైతులకు ఆన్‌లైన్ విధానంలో గుర్తింపు సంఖ్య ఇస్తున్నందున రైతులు తమ వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. రైతు గుర్తింపు కార్డు వలన వ్యవసాయ శాఖ సలహాలు, సూచనలను పొందడానికి, పంట నష్టం, ప్రకృతి వైపరీత్యాలు జరిగినప్పుడు బీమా పరిహారంలో ఉపకరిస్తుందని చెప్పారు. రైతులు తమ ఆధార్ కార్డు, పొలం పాస్ పుస్తకం, 1బీ, ఆధార్‌తో అనుసంధానం చేసిన మొబైల్ నంబర్‌తో రైతు సేవా కేంద్రంలో సంప్రదించి ఆన్‌లైన్‌లో గుర్తింపు సంఖ్య పొందవచ్చని చెప్పారు. పశువైద్యాధికారి స్వప్న, వ్యవసాయ విస్తరణాధికారి అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

వైభవంగా వేంకటేశ్వరుడి కల్యాణం



మునుకుళ్ల(తిరువూరురూరల్): మండలంలోని మునుకుళ్ల వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో స్వామివారి వార్షిక కల్యాణోత్సవం సోమవారం రాత్రి శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆలయ అర్చకుల వేదమంత్రాలతో స్వామివారిని పెళ్లి కుమారుడ్ని చేసి గ్రామోత్సవం, ఎదుర్కోలు నిర్వహించిన అనంతరం కల్యాణ మండపంలో వివాహ క్రతువు జరిపారు. గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి కల్యాణ వేడుకలను వీక్షించారు. ముక్కెర వెంకటకృష్ణారెడ్డి దంపతులు కన్యాదానం చేశారు.

పార్టీ ఫిరాయించే వారిని రీకాల్ చేయాలి

నూజివీడు: ఒక పార్టీలో గెలిచి మరో పార్టీ మారే వారిని రీకాల్ చేయాలని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.హరినాథ్ మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల్లో కూటమి నాయకులు తాము నూరు శాతం కైవసం చేసుకోగలిగామని హర్షం వ్యక్తం చేయడం హాస్యాస్పదంగా ఉందని ఆయన విమర్శించారు. వైఎస్సార్ సీపీ అభ్యర్థులుగా గెలిచిన కౌన్సిలర్లు అధికార మార్పిడి జరిగిన తర్వాత తమ స్వార్థం కోసం ప్రజల తీర్పును విస్మరించి పచ్చ కండువా కప్పుకోవడం ఏమిటని ప్రశ్నించారు.